క్లుప్తంగా

అక్రమ నిర్మాణం తొలగింపు



సుండుపల్లె : ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన ఇంటి నిర్మాణాన్ని కోర్టు ఆదేశాల మేరకు తొలగించినట్లు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. సుండుపల్లె మండలం బుర్రలదిన్నె పల్లెలో సర్వే నెంబర్ 395లో ఉన్న రహదారిని అదే ఊరికి చెందిన వ్యక్తి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి కావడంతో కొన్ని నెలల క్రితం గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో వ్యాజ్యులు విన్న న్యాయమూర్తులు అక్రమ నిర్మాణం తొలగించాలని ఆదేశించడంతో శుక్రవారం సాయంత్రం అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ తెలిపారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



రాయచోటి టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి వారి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పలకలు పంపిణీ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యులు షంషీర్ వలీ ఆర్థిక సహాయంతో వీటిని అందించినట్లు అధ్యక్షులు శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ షేక్ మహమ్మద్, మాజీ అధ్యక్షులు పి.శివారెడ్డి, కోశాధికారి కె.మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపుపై హర్షం



కంప చెట్లను తొలగించిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : దిన్నెపాడు గ్రామం పర్వతరెడ్డి గారిపల్లి నుంచి బెస్తపల్లి ఎస్సీ కాలనీ వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం నెలకొంటుందో తెలిసేది కాదు. దీంతో ఈ సమస్యను మండల అధికారులకు ఆయా గ్రామస్తులు పలుమార్లు తెలియజేసిన పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సిపి యువనాయకులు గజేంద్రారెడ్డి జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంజనేయుడికి పూజలు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం కొత్తపేటలోని గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసియున్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్ మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకు పూజలు, సింధూర పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.


ఘనంగా మాలాలా దినోత్సవం



బహుమతులను అందచేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో అంతర్జాతీయ మాలాలా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా టచ్‌స్టోన్ విభాగం అడ్డంకులను దాటి.. బాలికల విద్యకు ఆటంకంగా మారే సాంస్కృతిక ప్రమాణాలను అధిగమించడం అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీ బాలికల విద్యపై సాంస్కృతిక సవాళ్లు అర్థం చేసుకోవడమే కాక అడ్డంకులను అధిగమించడానికి విద్యార్థులకు మార్గాలను సూచిస్తుందని భావించారు. కాగా పోటీల్లో విజేతలుగా నిలిచిన కిరణ్, సానియా అంజుమ్‌లకు ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణ, ఎల్.ఓబులపతి, టచ్‌స్టోన్ కో–ఆర్డినేటర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



చిట్వేలి : గర్భాశయ సమస్యతో బాధపడుతూ కడప శశికళ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతునఓ మహిళకు అత్యవసరంగా ఏ–పాజిటివ్ రక్తం అవసరమైంది. సామాజిక మాధ్యమం అయినా వాట్సాప్‌లో అత్యవసరతను తెలుసుకున్న చిట్వేలికి చెందిన సామాజిక కార్యకర్త ఇంతియాజ్ అహ్మద్ కడపకు వెళ్లి శుక్రవారం రక్తదానం చేశారు. విషయం తెలుసుకున్న కడపకు చెందిన పలువురు ఇంతియాజ్ అహ్మద్‌ను అభినందించారు.

కూటమి ఏడాది పాలన మోసాలమయం

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో విధ్వంసం
- దిశానిర్దేశం చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు



పోస్టర్ ఆవిష్కరణలో శ్రీకాంత్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, బాల సుబ్రమణ్యం

రాయచోటి : కూటమి ఏడాది పాలన మోసాలమయం, నయవంచన పాలనగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాయచోటి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ కమిటీలు, అనుబంధ విభాగాలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ.. చంద్రబాబు రీ కాలింగ్ మ్యానిఫెస్టో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు పరిశీలకులు ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, పట్టణ అధ్యక్షుడు నవాజ్, పార్టీ నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తున్నారని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. జగన్ ఇస్తున్నవే కాకుండా అంతకు మించి ఇస్తానని, ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారన్నారు. బాండ్లు ఇచ్చి, ప్రలోభాలు పెట్టి ప్రజలను పచ్చిమోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయలేదన్నారు. చంద్రబాబు పాలనతో ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎంత అనేది ప్రజలకు తెలియజేసి చైతన్యం చేయాలన్నారు. రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను వారు కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలపై క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు వివరించాలి..

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు వస్తాయన్నారు. అంతే కాకుండా చంద్రబాబు చేసిన దగా, పచ్చి మోసం వివరాలు కూడా వస్తాయన్నారు. గత ఏడాది ఇవ్వకుండా ఎగ్గొట్టింది ఎంత? ఇక ఈ ఏడాది రావాల్సిన మొత్తం ? అనేది కూడా తెలుస్తుందన్నారు.

ఏడాదిలోనే కూటమి వ్యతిరేకత

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిద్దామన్నారు. అలాగే జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం అభివృద్ధి విషయాలను ప్రజలకు చెప్పాలన్నారు.

సమష్టి కృషితో ముందుకు సాగుదాం..

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో సామాన్య ప్రజలను వేధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని మరచి వారి స్వార్థం కోసం పాలన సాగిస్తున్న నాయకులపైన పోరాటం సాగిద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హరూన్ బాషా, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, జాకీర్, ఎస్‌పిఎస్ రిజ్వాన్, జిన్నా, షరీఫ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, కౌన్సిలర్లు కొలిమిదాన్ బాషా, సాదిక్, షబ్బీర్, గౌస్ ఖాన్, రౌనక్, ఫయాజ్ అహమ్మద్, ఇర్ఫాన్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మహేష్ రెడ్డి, మాసాపేట ఇర్ఫాన్, ఇర్షాద్, కో–ఆప్షన్ అయ్యవారు రెడ్డి, ఖాదర్ వలీ, బిఎస్ఎన్ఎల్ సలహా సభ్యుడు అబుజర్, నియోజకవర్గ మేధావులు ఫోరం అధ్యక్షుడు జానం రవీంద్ర యాదవ్, అన్నా సలీమ్, జనతా బషీర్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు జాఫర్ అలీఖాన్, జావిద్, అమీర్, యూత్ అధ్యక్షులు కొత్తపల్లి ఇంతియాజ్, తాజ్, అనీల్, వాల్మీకి, సంఘం అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, గువ్వల జగదీష్, గువ్వల జగన్, శాతవాహన సంఘం అధ్యక్షుడు నాగేంద్ర, రొటేరియన్ హుస్సేన్, సుబ్బారెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో దక్షిణ వైపు సైదియా థియేటర్ నుంచి బస్టాండ్ వరకు డైట్ కళాశాల వద్ద ఈ విద్యుత్ పాత స్తంభాలను తొలిగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సంబేపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కె.జయమ్మను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారులు సన్మానించారు. ఎంఈఓ రమాదేవి, శ్రీనివాసులులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యలు అభినందించారు.


ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమే ప్రాధాన్యత



ఆర్టీసీ సిబ్బందితో కలసి కుర్చీలను పరిశీలిస్తున్న డీఎం మహేశ్వరరెడ్డి

రాయచోటి టౌన్: ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడమే ప్రాధాన్యత అని రాయచోటి ఏపీఎస్ ఆర్టీసీ నూతన డిపో మేనేజర్ జి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా 20 కుర్చీలు అమర్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రాయచోటి బస్టాండ్‌లో ప్రయాణికులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రయాణికులు ఆర్టీసీకి సహరించాలని సూచించారు. శ్రావణ మాసం త్వరలో రానున్న సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. త్వరలో కలిచెర్ల బస్సును పునరుద్ధరిస్తామని తెలిపారు. అలాగే రెడ్డివారిపల్లె బస్సును ఉపాధ్యాయులు, విద్యార్థుల ఇచ్చిన వినతి మేరకు నడుపుతున్నట్టు తెలియజేశారు. వచ్చే ఫిర్యాదులు, వినతుల ద్వారా ఆయా ప్రాంతాలలో వారిగా బస్సులు నడిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

గాలివీడు : శ్రవణా నక్షత్రం సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువైవున్న శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల మధ్య కనుల పండువగా సాగింది. కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రంగనాయకులు మంత్ర పఠనం, వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. కల్యాణోత్సవంలో ఉత్సవ విగ్రహాలకు, స్వామి, అమ్మవారి మూల విరాట్టులకు ప్రత్యేకంగా అలంకరించారు. వివాహ ఘట్టాలను, మాంగళ్య ధారణ వంటి ఘట్టాలను వివరిస్తూ, ఆద్యంతం ఆకట్టుకునే విధంగా కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీవారు అమ్మవార్ల కల్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

మత్తుకు బానిసైతే బతుకులు చిత్తు



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ వెంకటాద్రి నాయుడు

రాయచోటి టౌన్ : మత్తుకు బానిసలుగా మారితే బతుకులు చిత్తవుతాయని అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి నాయుడు అన్నారు. శనివారం రాయచోటి సబ్ జైల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను రాయచోటి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు ఖైదీలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలుగా కారాదని చెప్పారు. మత్తు పదార్థాలను సేవించినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. మానతవ సేవా సంస్థ అధ్యక్షులు ఎస్.సహదేవరెడ్డి, అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి.మధుసూదన్, జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, డీఈఓ సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ శాఖ రాయచోటి సీఐ వై.గురుప్రాద్, ఎస్ఐ హుస్సేన్ తదితరలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్ధవటం : మండలం నుంచి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ రఫీ హెచ్చరించారు. సిద్ధవటం మండలంలో బండికనుమ, మాచుపల్లె, టక్కోలు రహదారిలో శనివారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచుపల్లె, డేగనవాండ్లపల్లె, లింగంపల్లె, తురకపల్లె, సిద్ధవటం గాండ్లపాలెం సమీప ప్రాంతాల్లోని పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణను అరికట్టేందుకు పోలీసు సిబ్బందిని నియమించి నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే జరిమానా విధిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే వైద్యం పొందాలి



వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిద్ధవటం : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందాలని, ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి ప్రజలు డబ్బులు వృథా చేసుకోవద్దని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరం–1 పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్‌లో ఉన్న జీవీఎస్ ఓరియంటల్ హైస్కూల్‌లో శనివారం 104 సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో ప్రైవేటు వైద్యశాలకు దీటుగా మెరుగైన వసుతులు కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యం పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా వైద్యాధికారిణి శ్రీవిద్య, ఆరోగ్య కార్యకర్త రాజరాజేశ్వరి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి పూజలు



భక్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకుడు

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరుడికి ఆలయ అర్చకులు అమృనాయక్ శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించగా తదుపరి స్వామి వారికి అభిషేకం, నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబు హామీలకు లేదు ష్యూరిటీ.. దగా గ్యారెంటీ

- ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- ప్రభుత్వ వైఫల్యాలను తెలియచెప్పేందుకే రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో
- ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడదాం
- ప్రభుత్వ మెడలు వంచుదాం.. ఎన్నికల హామీలను అమలు చేయిద్దాం



మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు : చంద్రబాబు హామీలకు ష్యూరిటీ లేదని, మోసాలే గ్యారెంటీ అని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం గాలివీడులో మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గాలివీడు మండల స్థాయి రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, హిందూపురం వైఎస్ఆర్‌సీపీ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాజా మొహిద్దీన్, మండల, గ్రామ నాయకులతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని వైఎస్ఆర్ సీపీ కమిటీలు, అనుబంధ విభాగాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలుకు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వడం లేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పేదల కోసం పనిచేసి ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి «రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో» పేరిట ప్రజా చైతన్య కార్యక్రమాన్ని ప్రకటించారన్నారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు, సూపర్ సిక్స్ పథకాల అమలు విఫలమైందని ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వ పద్నాలుగు నెలల పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని, మోసాన్ని వివరించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల నాయకులు విజయవంతం చేయాలన్నారు. జగన్ 2.0లో కార్యకర్తలు, నాయకులకు పెద్దపీట వేయడం జరుగుతుందని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. తనను ఆదరిస్తున్న కార్యకర్తలు, నాయకులు మేలుకు జీవితాంతం రుణపడి వుంటానని తెలియజేశారు.

చంద్రబాబు మోసపు పాలన – రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డి

చంద్రబాబుది సూపర్ సిక్స్ పాలన కాదు, మోసపు పాలన అని మాజీ ఎమ్మెల్యే, హిందూపురం పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికలలో చెప్పిన ఏ హామీని ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం కూడా వైఎస్ఆర్‌సీపీ పోరాటాలతోనే, నిరసనలతోనే చంద్రబాబు అమలు చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదంటూనే యోగా కార్యక్రమానికి రూ.300 కోట్లు, రూ.250 కోట్లతో హెలికాప్టర్ కొన్నారని ఆయన దుయ్యబట్టారు. మంత్రి నారా లోకేశ్ అవినీతి పెరిగిపోతోందని, చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని పేర్కొన్నారు.

అమరావతి నిర్మాణంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

- జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యం

గాలివీడు : రాజధాని అమరావతి నిర్మాణంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలందరినీ మోసం చేస్తున్నారన్నారు. మా తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు గతంలో రాయచోటి మార్కెట్ యార్డ్‌లో జరిగిన సమావేశంలో చంద్రబాబు సమక్షంలోనే వైఎస్ఆర్ కుటుంబంతో తమకు సన్నిహిత సంబంధం ఉందని.. వాళ్లను ఎప్పుడూ విమర్శించనని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు సంపద సృష్టిస్తారని చెప్పారని, అది ప్రజల కోసం కాదు.. వారి కుటుంబ సభ్యుల కోసం సంపద సృష్టించుకుంటున్నారని ఆరోపించారు. కూటమి నేతలు ప్రజల నుంచి సొమ్మును దోచుకుంటుండడం వల్లే ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. సమావేశం ప్రారంభం నుంచి ముగిసేంత వరకూ జై జగన్ నినాదాలతో సభ హోరెత్తింది.

శ్రీ లక్ష్మీనారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు.

పరామర్శ



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలంలోని కస్తూరి రాజుగారిపల్లి గ్రామం గుర్రయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుమూర్తి ఇటీవల గుండె జబ్బుకు గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నాడు. గురుమూర్తిని శనివారం మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్ రెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిద్దక రామచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ చిన్నప్ప, రాజారెడ్డి, పచ్చిపాల ధర్మారెడ్డి, వాసుదేవుడు, గంగయ్య, దిలీప్ రాజు, మైనార్టీ నాయకులు బాబ్జాన్, బాలకృష్ణారెడ్డి, రేపన వెంకటేశు, సభాపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పైసలకు కక్కుర్తి.. అప్పనంగా ప్రభుత్వ భూమి!

- సర్కార్ జాగా అన్యాక్రాంతంపై వీఆర్‌ఓ మల్లికార్జునపై తీవ్ర ఆరోపణలు
- రికార్డులు తారుమారు చేసి కాసులకు భూములు అప్పగిస్తున్న వైనం
- కూటమి నాయకుల అండదండలతో చర్యలకు నోచుకోని వైనం



పెరియవరంలోని ప్రభుత్వ భూమిలో సాగవుతున్న నిమ్మతోట

పుల్లంపేట : ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఆక్రమణదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల పరిధిలోని పెరియవరం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు. 158లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని జానకీపురం గ్రామానికి చెందిన మల్లికార్జున వీఆర్‌ఓ మల్లికార్జునతో కుమ్మక్కై యథేచ్ఛగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిమ్మచెట్లు సాగు చేసుకుంటున్నాడు. మరోవైపు ప్రభుత్వ భూమిలో సమాధిని ఏర్పాటు చేసుకున్నారు. పలుమార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా గతంలో పనిచేసిన తహసీల్దార్ సమస్యను పరిష్కరించామని చేతులు దులుపుకున్నారు. ఈ వీఆర్‌ఓ 2015 నుంచి రెడ్డిపల్లి రెవెన్యూ గ్రామంలో విధులు నిర్వర్తించాడు. గతంలోనూ అనేక ప్రభుత్వ భూముల ఆన్‌లైన్‌లో రికార్డులు తారుమారు చేసిన సంఘటనలు ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం అప్పయ్యరాజుపేట గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తూ గారాలమడుగు, అప్పారాజుపేట, పెరియవరం తదితర గ్రామాలలో చాలా మంది రైతుల వద్ద నగదు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే పలుమార్లు జిల్లా అధికారులు పుల్లంపేటలో గత ఆరు నెలలుగా విధులు నిర్వహిస్తున్న వారిని సైతం బదిలీలు చేశారు. కూటమి నాయకుల అండదండలు ఉన్న వీఆర్‌ఓల బదిలీలు నిలుపుదల చేశారు. అలాగే గారాలమడుగు రెవెన్యూ గ్రామంలో రూ. 2 లక్షలు తీసుకొని దళితులకు ఇచ్చిన ప్రభుత్వ భూములు సర్వే నెంబరు. 127/1, 128/1, 128/2 సంబంధిత భూములకు సంబంధించి రికార్డులు మార్చడంలో వీఆర్‌ఓ కీలకపాత్ర పోషించాడు. అంతేకాకుండా ఉపాధిహామీ పథకం ద్వారా గారాలమడుగులో కుంటను సైతం ఆక్రమదారులు ఆక్రమించడంలో వీఆర్‌ఓ పూర్తి సహకారం అందించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇతనిపై జిల్లా స్థాయి అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.